'రచన' మాసపత్రిక – ఫిబ్రవరి, 2000

# అందమైన కల

కన్నబాబు చిరాగ్గా, చింతగా ఉన్నాడు. అస్థిమితంగా కూర్చున్నాడు.

ఆఫీస్‌కి రాగానే సాధారణంగా కన్నబాబు చుట్టూ ప్రపంచాన్ని మరచిపోతాడు. సీరియస్‌గా ఫైళ్ళ మధ్య మునిగిపోతాడు. చేస్తున్న పనికి అంకితమైపోతాడు.

ఆఫీషియల్ వర్కు మీద పది రోజుల క్రితం ముంబాయి వెళ్ళి గతరాత్రే ఇంటికి చేరేడు. ఆఫీసులో చేయాల్సిన పని ఎంతో ఉండడం చేత –

ఉదయం హుషారుగా, పరుగు పరుగున ఆఫీసుకి చేరితే –

అనూహ్యంగా ఒక కవరు ప్రత్యక్షమయింది అతని టేబుల్‌పై. ఆహ్వానం అంటూ పలకరించింది.

ఆఫీస్‌కి రాగానే అర నిమిషం దేవుణ్ణి స్మరించి పనిలోకి దిగడం అతని దినచర్య.

ఆ కవరు దేవుణ్ణీ, దినచర్యనీ ఓవర్‌టేక్ చేసింది. కదిపివేసింది. కుదుపులతో చికాకు పరిచింది.

నీరసం, నిస్సత్తువతో కొంతలో కొంత అసూయతో కుర్చీపై కూలబడిపోయేడు. కవరు మరోసారి తెరిచి చూసేడు.

కళకళలాడుతూ, సుగంధ పరిమళాన్ని విరజిమ్ముతూ అందమైన కార్డు.

అతని మిత్రుడు ప్రసాద్ ఆహ్వానం.

నూతన గృహప్రవేశం.

రెండు రోజుల క్రితమే ఆ శుభకార్యం జరిగిపోయింది.

ఆ రోజు కన్నబాబు లేడు. టూర్‌లో ఉన్నాడు.

మిత్రుడి శుభకార్యానికి వెళ్ళలేకపోయినందుకు కలగలేదు బాధ.

మిత్రుడిలా తనకు ఒక నూతన గృహం లేనందుకు రగిలిన, గెలికిన బాధ.

చూస్తుండగానే... ప్రసాద్ మాత్రమే కాదు... చాలామంది కొలీగ్స్ తోటి ఉద్యోగులు, తన బంధువులు... ఇలా గృహప్రవేశ ఆహ్వానాలతో పిలిచి... మరోవిధంగా తన చేతకాని తనాన్ని వెక్కిరిస్తున్నారు. వెర్రెక్కిస్తున్నారు.

ఒకరూ ఒకరూ ఎంచెక్కా సొంత ఇల్లు కట్టుకొని హాయిగా సెటిల్ అవుతున్నారు. తను మాత్రం మురికి కూపంలో ఇరుకు ఇంట్లో బందీ.

నూతన గృహాలు కట్టుకున్న వాళ్ళలో చాలామంది తనకన్న పెద్ద ఉద్యోగస్తులు కాదు. వెనుక ఆస్తిపాస్తులూ, వ్యాపారాలు ఉన్నవాళ్ళు కాదు. మొన్న మొన్న ఉద్యోగంలో చేరిన చిరుద్యోగులు కూడా సొంత ఇల్లుని ఎంజాయ్ చేస్తున్నారు.

తనూ ఉన్నాడు! ఎందుకు?

పదిహేనేళ్ళ సర్వీసు. ఇంత సుదీర్ఘ సర్వీసులో ఏం సాధించేడు?

యజమాన్యపు విశ్వాసం. మూడు ప్రమోషన్లు. ఆనందంతో మిత్రులకు పార్టీ ఇచ్చేడు. ఇదేం పెద్ద విశేషమా?

పెర్సనల్ విషయానికొస్తే-

ఉద్యోగంలో చేరిన నాలుగేళ్లకి అతనికి పెళ్ళి కుదిరింది. అందమైన అమ్మాయి - పేరు భారతి. ఆనందంగా శుభలేఖలు పంచేడు.

పెళ్ళి అయిన ఏడాదికి శిరీష ఉట్టింది. పార్టీ తీసుకున్నారు మిత్రులు. రెండేళ్ళకి అనీల్ పుట్టేడు. ఆనందంతో పార్టీ ఇచ్చేడు కన్నబాబు.

భార్య అన్నివిధాల అనుకూలమైనది. అతన్ని పూర్తిగా అర్థం చేసుకున్నది. పిల్లలు అల్లరి పిల్లలు కాదు. మందమతులు కాదు. చురుకైన వాళ్ళు. తెలివైన వాళ్ళు. తను గర్వపడేలా మంచి రాంకులతో కాన్వెంటు చదువులు.

ఓకే. అంతా బాగానే ఉంది. అయితే –

భార్యని ప్రత్యేకంగా సొంత భార్య అని రిఫర్ చేయరు.

శిరీషని, అనీల్‌ని మీ సొంత పిల్లలేనా అని అడిగి దవడపళ్ళు రాళ్ళకొట్టించుకోరు.

ఇల్లుని మాత్రం 'ఇది సొంత ఇల్లేనా' అని అడుగుతారు. కాదు అంటే సొంత ఇల్లు కట్టేది ఎప్పుడు అని అడుగుతారు. వేగిరం కట్టేయ్ కట్టేయ్‌మని పోరుతారు. సలహాలు పారేస్తారు. 'ఇంకా ఇల్లు కట్టని మీ భర్తని ఎలా క్షమిస్తున్నావమ్మా' అని ప్రశ్నిస్తారు భారతిని.

టేప్ రికార్డర్, టీవీ, ఫ్రిజ్ ఇలా ఒకొక్క వస్తువు దశలు వారీగా ఇన్‌స్టాల్‌మెంట్లుగా అప్పుడప్పుడు కొని ఆమెను తృప్తిపరచేడు.

ఆర్థిక స్థితిగతులు ఆమెకు తెలుసు గనుక సొంత ఇల్లు కోసం ఆమె ఏనాడూ పోరు పెట్టలేదు.

మొదటిసారిగా గత రాత్రే, తాను టూర్ నుంచి వచ్చిన రోజే 'సొంత ఇల్లు' అవసరం తెలియజేసింది.

ఎవరో ఇంటి తలుపులు తట్టి పోస్టుకార్డుల్లా పడేస్తున్న నూతన గృహ ప్రవేశ ఆహ్వానాలను చూసి అసూయతో కాదు –

అవమానంతో, ఆగ్రహంతో దు:ఖంతో.

పది రోజుల టూర్ నుంచి వచ్చిన భర్తని కాస్త విశ్రాంతి కూడా తీసుకోనివ్వకుండా ఒక్కసారిగా ఏడుపునందుకుంది భారతి.

"ఏమైంది భారతీ, ఏమైంది" – ఆందోళన చెందాడు కన్నబాబు.

"ఏం చెప్పమంటారండీ? ఇంతకన్నా అవమానం ఇంకేముంటుందండీ?"

అతని కన్నీళ్ళు తుడిచేలోపుగా ఆమె అతని గుండెల మీద వాలిపోయి కన్నీళ్ళని చొక్కాకి రుద్దేసింది.

"అవమానమా! అదేవింటి? నిన్ను అవమానించే ధైర్యం ఎవరికుంది ఇక్కడ?"

"ఇంకెవరు? ఆ పెంటమ్మ"

పెంటమ్మ పేరు వినగానే లోడ్ లారీ దూసుకువస్తే తప్పుకున్నట్టు సైడయ్యేడు కన్నబాబు.

పెంటమ్మ అంటే పనిమనిషి కాదు. పొరుగమ్మ కాదు. ఇంటి ఓనర్.

పెంటమ్మకి పిల్లలు లేరు. గేదెలున్నాయి. ఒకప్పుడు ఆమెకు ఇద్దరు మొగుళ్ళు ఉండేవారు. ఉండడం ఒకేసారి కాదు. ఒకడు పోయేక ఒకడు. మొదటి మొగుడు ఆమెకు జడిచి పారిపోయేడు. రెండోవాడు ఆమెను తట్టుకోలేక మట్టిలో కలిసిపోయేడు. పోకుండా ఆమెను అట్టిపెట్టుకుని ఉన్నవి గేదెలు. అవి పది ఉంటాయి. పాలిస్తాయి.

నీళ్ళు ఒక్క చుక్క కూడా కలవకుండా పాలు నూటికి నూరిపాళ్ళు స్వచ్ఛమైనవి ఇస్తుందని ఆమె వాడకం దారులు బలంగా నమ్ముతారు. ఆమె అంతే ఖచ్చితంగా పాల డబ్బులు వసూలు చేస్తుందని వాళ్ళకి తెలుసు.

రంగులోనూ, రూపులోను పెద్ద తేడా లేదు. గేదెల మధ్య పెంటమ్మ ఒక పెద్ద గేదెలా కలిసిపోతుంది. ఆమె వయసు యాభై ఉంటుంది. పశువుల పాకను ఆనుకోని ఉన్న ఒక కమ్మల గుడిసెలో ఉంటుంది.

ఎదురుగా పశువుల శాల లాంటి ఆరు పోర్షన్ల ఇల్లు బారుగా కట్టింది. ఒక పోర్షనంటే ముందు క్లోజ్‌డ్ వరండా. ఒక గది. తర్వాత వంటగది. ఆరు పోర్షన్లకి కలిపి మూడు సెప్టిక్ లెట్రిన్లు. మూడు బాత్‌రూమ్‌లు. ఒకే ఒక కొళాయి. నీళ్ళు ఉదయం ఒక గంట మాత్రమే వస్తాయి. ఒకరు తర్వాత ఒకరు ఒక్కో బిందె చొప్పున పట్టుకోవాలి. పెంటమ్మ దగ్గరుండి పెత్తనం చేస్తుంది.

అది ఆమె రాజ్యం.

తనకిష్టమైన వాళ్ళు, మంచి మాటలు ఆడేవాళ్ళు కొన్ని బిందెలు ఎక్కువ సంపాదించు కోగలుగుతారు. 'పెంటమ్మా నీది అన్యాయం, అక్రమం!' అంటే బూతులు తిడుతుంది. ఇళ్ళల్లో రాత్రి పది గంటల తర్వాత లైట్లు వెలగడానికి వీల్లేదు. (ఎవరి కరెంటు బిల్లు వారిదే అయినప్పటికీ) పాకీదాని చేత రోజూ దొడ్లు కడిగిస్తున్నాను పది రూపాయలు నెలనెలా ఇవ్వాలి, అంతా ఇవ్వక తప్పదు. అంతే! మున్సిపాలిటీ మొగుడు పన్ను వేయడానికి వస్తాడు. మీరు అద్దెకి ఉన్నట్టు చెప్పగూడదంతే. మీరంతా నా కుటమానం – నా అప్ప సెల్లెళ్ళు. కూతుళ్ళూ, కోడళ్ళూ, తెల్సిందా. అంతేకాదు ఇంటి పన్ను పెంచారు. అద్దె పెంచుతున్నాను. మరిక మాటాడకండి. అంతే అంతే – పెంచిన అద్దె కట్టండి.

ఆ రోజు –

ఉదయం పది గంటల ప్రాంతంలో పెంటమ్మ భారతిని పిలిచింది.

పెంటమ్మ ఎప్పుడూ గదిలోకి, గుమ్మంలోకి రాదు. వీధిలోంచి మాటాడుతుంది. నీవు వీధిలోకి వెళ్ళక తప్పదు. మిగతా కొంపల ఆడవాళ్ళు కూడా పిలవని పేరంటానికి హాజరయి కళ్ళు, చెవులూ అక్కడ పడేస్తారు – ఎక్కడి పని అక్కడే వదిలేసి, పారేసి.

పెంటమ్మ పిలవగనే భారతి బయటికి వచ్చింది.

"వాళ్ళెవరు?" అనడిగింది భారతి ఇంట్లో సంచరిస్తున్న కొత్త ముఖాలను చూపిస్తూ.

"మా చుట్టాలు"

"చుట్టాలు కాకపోతే ఎందుకొస్తార్లే. ఎప్పుడొచ్చారంటావ్?"

"నిన్న వచ్చేరు"

"ఎప్పుడు దయచేస్తారు?"

భారతికి ఒళ్ళు మండిపోతోంది. అనవసరమైన అడ్డమైన పెంటమ్మ ప్రశ్నలకి సమాధానం చెప్పే ఓపిక బలవంతం మీద తెచ్చుకుంటోంది. తెచ్చుకున్న ఓపిక హరించుకుపోకుండా నిగ్రహించుకుంటోంది. చుట్టూ చేరుతున్న ఇరుగు పొరుగుని చూసి సిగ్గుతో బిక్కచచ్చిపోతోంది.

"చుట్టాలు ఎపుడెళిపోతారని నిన్నే అడుగుతున్నా భారతమ్మా."

'నీ కనవసరం' అనలేకపోయింది. నిజానికి వచ్చిన చుట్టాలు ఎప్పుడు వెళ్తారో భారతికే తెలీదు.

భారతి మౌనం వహించింది.

"వీళ్ళే కాదు. ఈ మధ్దెన ఒక స్టూడెంటు బాబు వచ్చేడా లేదా? ఎఱ్ఱగా, పొట్టిగా టమాట పండులా ఉంటాడు"

"అతనా మా మరిది. పని మీద వచ్చేడు"

"ఎందుకొచ్చేడో నాకు చెప్పొద్దు. ఎన్ని రోజులున్నాడో చెప్పు".

భారతికి గుర్తులేదు.

"మూడు, నాలుగు రోజులనుకుంటాను"

"అబద్ధం ఆడకు. సరిగ్గా వారం రోజులున్నారు. నాకు లెక్కలు చెప్పకు"

"అయితే ఏమిటట? నిన్ను ఏమైనా అన్నాడా?" నిగ్రహం సడలుతోంది.

"నన్ను అనే ఎదవెవ్వడు? దవడ పళ్ళు రాలగొట్టీనా?"

ఇంట్లోంచీ వింటున్న చుట్టాల ముఖాలు నల్లగా అయిపోయేయి. ఛీత్కారం చేసి సామాన్లు సర్దుకొని వెళ్ళిపోవాలనిపించింది వాళ్ళకి. ఆ పని చేస్తే పెంటమ్మ నిజంగా సంతోషిస్తుంది.

"అయిందేదో అయిందిగాని ఈ సుట్టాల్ని మట్టుకు వేగిరం పంపేయి భారతమ్మా."

"ఎక్కడికి పెంటమ్మా?"

"ఇది మరీ బాగుందమ్మా! ఎక్కడికో నాకేటి ఎరిక. ఏ గోదాట్లోకి దింపుకుంటావో దింపుకో. నా యింట ఉండానికి వీల్లేదు అంతే."

"వాళ్లుంటున్నది నీ ఇంట్లో కాదు. నా యింట్లో."

"అమ్మోలమ్మోలమ్మా! కత శానా దూరం వచ్చేసినాదే! అమ్మా తల్లీ భారతమ్మా ఇది నా యిల్లు. నా ఇంట్లో నీవు అద్దెకుంటున్నావు. అది గ్గేపకం ఎట్టుకో"

"అవును అద్దెకుంటున్నాం గనుకనే అద్దె నీది. ఇల్లు నాది! అది నీవు గుర్తుపెట్టుకో."

పెంటమ్మకి తిక్కరేగి దాన్ను చేసింది.

"అమ్మా! భారతమ్మా. నీ గడుసుతనం నా దగ్గర కాదు. ఇదిగో నీ విచ్చే ముష్టి అయిదొందలకి నేను ఇల్లు అద్దెకిచ్చింది నలుగురికి. నలుగురెవరూ? నీవు. నీ మొగుడు, ఇద్దరు పిల్లకాయలు, అంతే తప్పా నీ తరుపు సుట్టపోళ్ళకీ. నీ మొగుడు తరుపు సుట్టపోళ్ళకి కలిపి జాయింట్‌గా అద్దెకివ్వలేదు తల్లీ. ఇంతకు ముందు మీ మరిది గుంటడు వచ్చినప్పుడే వార్నింగ్ ఇద్దామనుకున్నా వెధవ ముండని. పోనీలే అని వూరుకుంటే ఇప్పుడు మరో ముగ్గురు! ఇంకా వూరుకుంటే ముప్పయి ముగ్గురవుతారు. అంసేత నేను చెబుతున్నది జాగర్తగా వినుకో. ఇంట్లో మీ నలుగురూ తప్పా మరో పిట్ట పురుగు వుండడానికి వీల్లేదు. ఇదే సెప్పడం."

"వాళ్ళుంటే నీకొచ్చిన నష్టమేమిటి?" తీవ్రంగానే అడిగింది భారతి.

"ఇదేటి ఇయమ్మ యిలా గంటాది" చిత్రంగా గెడ్డంపై చేయి చేర్చి కళ్ళు చక్రాల్లా

తిప్పుతూ అందరివైపు చూసింది పెంటమ్మ.

అమ్మలక్కలు అంతా ఉత్సాహంగా వింటూ ఉత్సుకతతో చూస్తున్నారు. రేపు పెంటమ్మ మన్నల్ని కూడా ఇలా అంటుంది అని వాళ్ళ కప్పుడు అనిపించలేదు. పెంటమ్మ పేరు చెప్పుకొని చుట్టాల బెడద నుంచి బయటపడడానికి ఇది బలేగుంది అనుకుంటున్నారేమో!

"అయ్యో! ఇంతసేపూ నేను నెత్తీ నోరు కొట్టుకుంటున్నది నీ కరదం కానేదన్నమాట. నేను తెలీక అడుగుతాను.. అమ్మా! భారతమ్మా... నీవెప్పుడైనా లాడిజింగుల కెళ్ళినావా?"

షాక్ తిన్నది భారతి.

"లాడ్జింగ్ లేమిటి? జాగర్తగా మాటాడండి" అరిచింది భారతి.

తెల్లబోయింది పెంటమ్మ.

"ఏటి? నా నేటి అన్నాను? భగవంతుని సాచ్చిగా ఎలాంటి దురుద్దేశంతో అనలేదు. నేను ఏటంటున్నానంటే లాడిజింగుల్లో గెదులు అద్దెకిస్తారా? ఆళ్ళ రూమ్‌లో గెస్టుగాళ్ళు ఎగ్స్ట్రా వుంటే మనిషి కింతని డబ్బులు వసూలు చేస్తారు. అవునా కాదా! నేనది సెబుతుంటే .. నీవు ఇంకేదో అనుకుంటే నానేటి సేసేది. పెడబుద్ధిలోలికే పెడాలోసన్లు వస్తాయి. అయినా నాకెందుకులే.. ఇంతకీ నేను గట్టిగా సెప్పేదేటిదంటే ఆ గెస్టు గాళ్ళని వేగిరం తోలేయి."

"తోలేయడానికి నీ గేదెలనుకుంటున్నావేటి? వాళ్ళు మాకు బాగా కావాల్సిన వాళ్ళు. ఇంట్లో చుట్టాలు ఉంటున్నారు గాబట్టి నీకు అద్దె కాకుండా మనిషికి ఇంతని చెప్పి ఎక్స్ట్రా ఇవ్వాలంటావ్ అంతేనా? ఎంత కావాలో చెప్పు ఇచ్చేస్తాను."

"శశ! అంత నీచానికి ఒడిగట్టదు పెంటమ్మ. అలాంటి కక్కుర్తిపడే మనిషిని కాన్నేను. నేన్నీకు ఎలా అగుపిస్తున్నానో గాని.... నాకు ముప్ఫయి తులాల బంగారముంది. గాజువాకలో బంగారం లాంటి భూవుంది. నా మాసిన కోకనీ, ముక్కులో సత్తునీ సూసి ఏటో అనుకుంటున్నావు గావాల. ఇందాకల నుంచి సూస్తున్నా కదూ! నోరు మా జోరుగా పారేసుకుంటున్నావు. నీ సుట్టాలు నా సొట్ట గేదెపాటి సేయరు. పెడసరంగా మాటాడుతున్నావు గాని నేను అంటున్నదేటో సరిగా ఇనిపించుకోవు గదా."

పెంటమ్మతో మాటామాటా పెంచి అనవసరంగా మాటాడుతున్నట్టు ఆమెకి తోచింది. వెంటనే వదిలించుకోవాలనుకుంది. అంచేత అసహనంగా, "ఏమిటో చెప్పండి" అంది.

"సిరాకు పడకు భారతమ్మా!. ఇదిగో అటిని సూడు... బంగారం లాంటి దొడ్లు. కట్టి పదేళ్లు కాలేదు. బాగా మెక్కేసి కడుపు పట్టుకొని మంద... మంద... ఆ దొడ్లు మీద పడిపోతుంట్రు. దొడ్లకు ఒక మినేటు కూడా రెస్టు ఇవ్వకుండా పందేలు ఏసుకున్నట్టు ఒకలు తర్వాత ఒకలు పరిగెట్టేసి లైన్లు కాసేస్తున్నారు. ఇక దొడ్లు ఏటి పనిచేస్తాయి. మొన్నంటే మొన్నేనా మున్సిపాలిటీ వోళ్ళకి అయిదొందలు పోసి శుబ్బరంగా క్లీను సేయించేను. ఆ అయిదొందలు ఎవరిచ్చినారు? నీవా? నేనా? సెప్పు? ఆ బాత్రూంలు అంతేగద! ఇంతమందికి మూడు ఎలా సాల్తాయని నాపై విసుక్కుంటారుగాని.. గబగబా తానాలు కానీయరు గద!

ఒక్కోళ్ళు గంటలు గంటలు తానాలాడుతారు - జగదేకసుందరి జలకాలాడినట్టు. ఏం? స్కూలు కెళ్ళే పిల్లలకీ, డూటీల కెళ్లే మగాళ్ళకీ కూడా బాత్రూంలే కావాలా? వాకిట్లో నీళ్ళు గుమ్మరించుకోవచ్చు గదా!... ఇంతకీ నేను అనేదేటిదంటే దొడ్లూ, తానాల గెదులూ ఇంత రద్దీగా ఉన్నాయి గదా. మళ్ళా గెస్టుగోళ్ళు, సుట్టపోళ్ళు, బుడిబుడిలింగం గోళ్ళు తారసపడితే నేనాప్పేది లేదు. ఇదే నేను సెప్పడం. నాకు తెలీకుండా మరో మనిషి ఈ దొడ్లు, తానాల గెదుల జోలికి రాడానికి వీల్లేదు"

"నీ రూల్సు మా ఆయనొచ్చేక ఆయనకి చెప్పండి నాక్కాదు."

"ఇదేటి?" పకపక నవ్వింది పెంటమ్మ. 'సూడండర్రా! మొగుడికి భారతమ్మ సెప్పు కోలేదంట. భారతమ్మ మొగుడికి నేను చెప్పాలంట! సంసారి"

ఇంకా ఏవేవో అంటోంది పెంటమ్మ. భారతి వినిపించుకోకుండా భళుక్కుమని వాంతి వచ్చినట్టు గబగబా ఇంట్లోకి వెళ్ళిపోయింది. అప్పటికే ఆమె కళ్ళల్లో నీరు ఉబికేసింది. నలుగురిలో సిగ్గుతో చితికిపోయింది.

వెంటనే ఇల్లు ఖాళీ చేసేయాలని నిశ్చయించుకుంది.

టూర్ నుంచి కన్నబాబు రాగానే గుండెల మీద పడి చెప్పుకుని ఏడ్చేసింది.

పెంటమ్మ పైకి గొడవ కెళ్ళడం మూర్ఖత్వమే అవుతుంది. ఆమె మాట దురుసు తప్ప మనిషి చెడ్డది కాదు. మరుచటి రోజు ఉదయమే ఆత్మీయంగా, కలుపుగోలుగా కలిసిపోతుంది. రాత్రి జరిగింది మరిచిపోతుంది.

"భారతీ! ఆవేశపడకు. మరో ఇల్లు మారడం అంత సులభం కాదు. నానా చంకలు నాకి రోడ్లంబడి తిరిగి, వీధిల్లో పడి ఇల్లు సంపాదించామే అనుకో. ఆ కొత్త హౌసు ఓనర్ మీద పెంటమ్మే వందరెట్లు నయమనిపించవచ్చు - దిగేక"

"అంతేనంటారా?" అంది నీరసంగా.

"లేదు. మార్గముంది?"

"ఏమిటి?"

"మనం సొంతంగా ఇల్లంటూ నిర్మించుకోవడం."

భారతికి మహాదానందమయింది. ఆమె కన్నీళ్ళు తుడుచుకొని, చెదిరిన జుట్టుని ముడివేసుకుని, "అవునండి మీరన్నది బాగుంది. మనకి ఇల్లంటు వుంటే పెంటమ్మలతో మాటలు పడవలసి ఉండదు. నాకెందుకో ఇన్నాళ్ళు ఆ తలపే రాలేదు. గేదె పాలుతో ఇల్లు మీద ఇల్లు కట్టేస్తోంది పెంటమ్మ ముండ. కంపెనీ లోనుతో చిన్నిల్లు కట్టలేరా? కావాలంటే చెప్పండి నా పది తులాల బంగారం ఇచ్చేస్తాను" అని భర్తకి హామీ ఇచ్చింది.

"ఇక మీరు 'సొంత ఇల్లు' ప్రయత్నంలో ఉంటారు" - ఆమె ఆదేశించి అతని ఒడిలోంచి లేచింది.

❖ ❖ ❖

భార్య ఆదేశంతో అతనికి 'సొంత ఇల్లు' తలంపు రాలేదు.

సొంత ఇల్లు అనేది అందమైన కల.

కల వాస్తవ రూపం దాల్చడం రిటైర్ అయ్యేక మాత్రమే సాధ్యమని ఉద్యోగంలో జాయిన్ అయిన మొదటి రోజుల్లో భావించేడు.

ప్రస్తుత పరిస్థితులు అతణ్ణి రిటైర్ అయ్యేవరకూ ఎదురు చూడనీయడం లేదు.

ఇల్లు నిజంగా కావాలనుకుంటే అది ఇప్పుడే సమకూర్చుకోవాలి తప్పా, ఎప్పుడో రిటైర్ అయ్యేక అంటే అసాధ్యమనిపిస్తోంది.

'ఇల్లు కట్టి చూడు' అని పూర్కెనే అనలేదు పెద్దలు.

ఇల్లంటే మాటలు కాదు.

నగరంలో స్థలం దొరకడం దుర్లభమవుతుంది. బిల్డింగ్ కాస్ట్‌కి ధీటుగా స్థలం రేట్లు ఉంటున్నాయి. చూస్తుండగానే బిల్డింగ్ మెటీరియల్ ధరలు ఇబ్బడిముబ్బడిగా పెరిగిపోతున్నయి.

శరవేగంతో పెరుగుతోంది నగరం. సామాన్యుడు ఒక ఇండిపెండెంట్ ఇల్లు సొంతం చేసుకోవడం అంటే ఆకాశానికి నిచ్చెనలు వేయడం.

స్థలం కోసం కన్నబాబు పడుతున్న అవస్థలు భారతి గమనిస్తూనే ఉంది.

స్థలాల ధరలతో పోటీపడలేక మరో ఆల్టర్‌నేటివ్ లేక అపార్టుమెంట్‌పై మొగ్గుచూపక తప్పడం లేదు. సామాన్యుడే కాదు అన్ని తరగతుల ప్రజల్లోనూ అపార్టుమెంటు కల్చర్ అలవడింది. అలవర్చుకోక తప్పదు.

భారతి అపార్టుమెంట్ కొనుక్కుందామనుకుంది.

కన్నబాబు ఇష్టపడలేదు. వద్దు అన్నాడు.

అతనికెందుకో అపార్టుమెంటుపై పూర్తిగా వైముఖ్యం. అతని మిత్రులు ఉంటున్న అపార్టుమెంట్లు దర్శించేడు. అతను ఇష్టపడలేదు.

"ఇల్లు అంటే ఇండిపెండెంట్‌గా వుండాలి" అన్నాడు కన్నబాబు.

"బాగానే వుందండి. వ్యక్తిగత అభిరుచులు నాతో చేయించుకునే గులాబ్ జాముల్లా రుచిగానూ, పసందుగానూ ఉంటాయి. మన ఆర్థిక స్థోమతు విస్మరిస్తే ఎట్లా? ఎంత చెట్టుకి అంత గాలి" అంది భారతి.

ఇండిపెండెంట్ ఇల్లే కావాలనుకంటే అవుతుంది. అయితే అర్బన్ ఏరియా నుంచి బహుదూరంగా రూరల్ ప్రదేశానికి పారిపోవాలి.

అక్కడ కూడా ఇబ్బందులున్నాయి.

నగర శివార్ల ప్రాంతంలో స్థలాల ధరలు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి. చిత్రంగా వ్యాపార కల్చరు ఉద్యోగస్తుడిలో కూడా ప్రవేశించింది. అతనికి ఉండడానికి ఒక ఇల్లు అంటూ ఏర్పడినప్పటికీ అక్కడతో ఆగకుండా కొత్త స్థలాల కోసం తీవ్ర దాహంతో

అన్వేషిస్తున్నాడు. ఈ రోజు గజం మూడు వందలకి కొంటే రేపు అదే స్థలం గజం మూడు వేలకి అమ్ముడుపోతుందని నమ్మి ఇంట్లో బంగారాన్ని కూడా అమ్మి ఇళ్ళ స్థలాలపై ఇన్వెస్టు చేస్తున్నాడు. ఒకప్పుడు భూములు అమ్మి బంగారం కొంటే ఇప్పుడు బంగారం అమ్మి ఇళ్ళ స్థలాలపై పెట్టుబడి పెడుతున్నారు. మరోవైపు రియల్ ఎస్టేట్‌దారులు పోటీపడి దొరికిన చోటల్లా ఎకరాల కొలది స్థలాలు కొనేసి బోర్డులు పెట్టేస్తున్నారు.

ధరలను రియల్ ఎస్టేటు దారులు పెంచుతున్నారంటే అర్థం చేసుకోవచ్చు. కాని గవర్నమెంటే అనూహ్యంగా భూమి ధరలను పెంచేస్తోంది.

న్యాయంగా చూస్తే ప్రభుత్వం స్థలాల ధరలు పెరగకుండా అదుపులో ఉంచాలి. అభివృద్ధి లక్ష్యంతో ఉపయుక్తమైన ప్రణాళికలతో నిర్మాణాత్మకమైన పాత్ర వహించాల్సింది పోయి తప్పుడు విధానాలతో ధరలు మరింతగా పెంచేస్తోంది. ప్రభుత్వ భూములన్నీ వేలం వేసి నేల ధరలను ఆకాశం వైపు చూపిస్తోంది ప్రభుత్వం.

నగరాభివృద్ధి సంస్థ గాలిలో వేలాడే ఏవో ప్రాజెక్టుల పేరుతో ఎకరాలపై ఎకరాలు భూసేకరణ పేరిట కబంధ హస్తాలు చాపుతోంది.

కన్నబాబు అనుభవంలోకి వచ్చిన సంగతులను భారతికి చెబుతుంటే ఆమెకి భూమి భాగోతం అర్థమయి అర్థమవనట్టుగా ఉంటోంది.

ఈ నేపథ్యంలో ఇల్లు కట్టుకునేదెట్లా అని దిగులుతో కుమిలిపోతున్న కన్నబాబు ఒకరోజు ఉత్సాహంగా ఇంటికి వచ్చేడు. వస్తున్నప్పుడు తోవలో పెంటమ్మ అడ్డుగా తగిలితే తప్పుకోమని ధైర్యంగా అరిచి గభాల్న ఇంటిలోపలికి ప్రవేశించి, తలుపులు వేసి, భారతిని అప్యాయంగా పిలిచేడు.

"నీకో శుభవార్త"

ఆమెను దగ్గిరికి తీసుకున్నాడు.

భర్తలో అంత ఉత్సాహం ఆమె ఈ మధ్య చూడలేదు.

"ఏమిటండీ" ఆమెలోనూ ఉత్సాహం.

భారతిని, కాసేపు 'సస్పెన్సు'లో పెట్టి కొంత ఏడిపిస్తే ఎలా ఉంటుంది?

ఆమెను ఏడిపించలేదు. ఆ శుభవార్త ఏదో వెంటనే వినిపించకుండా వుండలేని స్థితిలో అతనే వున్నాడు.

మరోసారి ఆమెతో అడిగించుకోకుండా వెంటనే పాకిట్ నుంచి ఒక పెద్ద కాగితం తీసి మడతలు విప్పి విశాలంగా టేబుల్‌పై పరిచేడు.

ఆ కాగితంపై అతని స్వప్నం నిలబడి ఉంది. ఒక అందమైన ఇల్లు మూడు కోణాల్లో చూపబడి ఉంది!

టూ బెడ్ రూమ్ హవుస్. విశాలమైన హాలు. దానిని ఆనుకొని కిచెన్. చుట్టూ బౌండరీ వాల్. మొక్కలు వేసుకోవడానికి తగినంత విశాలమైన స్థలం.

"ఎలా ఉంది?"

"సంబడం! కాగితం మీద కాదు- ఇల్లు నేలపై చూపించండి"

"ఎందుకంత తొందర! నీవు పుట్టగానే నా పెళ్ళానివైపోయేవా?"

"అంటే ఇల్లు కట్టడానికి ఇరవయ్యేళ్ళు పడుతుందా!"

"చచ్చాం! పూర్తిగా విను. నేను మంచి మూడ్‌లో వచ్చేను. నేను చెప్పేది పూర్తిగా విను."

ఆమె పూర్తిగా విన్నది.

అర్థం కాని చోట విడమరచి చెప్పేడు.

అతని కోసమే అన్నట్టు -

ఎంప్లాయిస్ కో-ఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీ గృహ నిర్మాణానికి నిలిచింది. నడుం కట్టింది. ముందుకు ఉరికింది.

ఉద్యోగుల సాంఘిక సంక్షేమం కోసం ఆయా కంపెనీలలో వివిధ కో-ఆపరేటివ్ సంస్థలుంటాయి. కన్స్యూమర్ సొసైటీ నీకు అవసరమయ్యే వినియోగ వస్తువులను సరసమైన ధరలకు క్వాలిటీతో అందచేస్తుంది. థ్రిఫ్ట్ సొసైటీలు బ్యాంక్‌ల కన్నా తక్కువ వడ్డీతో నీకు ఋణ సౌకర్యం కలుగుజేస్తాయి.

అదేవిధంగా ఆ కంపెనీలో ఉద్యోగులకు ఇల్లు నిర్మించి ఇవ్వడానికి హౌస్ బిల్డింగ్ సొసైటీ ఏర్పడింది.

ఎందరో కన్నబాబుల కిది కల్పతరువు.

ఆధాయ పరిమితులకు లోబడి హయిర్, మిడిల్, లోయర్ ఇన్‌కమ్ గ్రూప్‌లుగా విభజింపబడి ఆయా తరగతి ఉద్యోగుల నుండి అప్లికేషన్స్ ఆహ్వానించబడ్డాయి.

కన్నబ్బాయ్‌ది మిడిల్ ఇన్‌కమ్ గ్రూప్. అప్లికేషన్ అందరికన్నా ముందు తనే సబ్‌మిట్ చేసి ఇంటి ప్లానుతో ఉత్సాహంగా భారతి ముందు వాలేడు.

ఇల్లు సాధిస్తున్నందుకు మహదానందంతో ఆమె చేతులు అతని మెడ చుట్టూ వెళిపోయేయి.

ఇదే సమయంగా భావించి ఆమె చేయాల్సిన త్యాగం గుర్తు చేశాడు.

బంగారు నగలు!

అతని మెడపై నుంచి ఆమె చేతులు వెనక్కి వచ్చేసాయి. పెదాలపై నవ్వు ఇంకి పోయింది. కన్నబాబుకి అడుగు దూరం జరిగింది. నిమిషం ఆలోచించింది. వెంటనే అడుగున్నర దగ్గరికి జరిగింది.

'సరే' అనలేక "మీ ఇష్టం" అంది.

రెండు నిముషాలు పోయేక -

"ఏమండీ! నా బంగారమంతా ఇచ్చేయాలా?"

"ఏం అలా అంటున్నావ్?"

"అది కాదండీ బంగారమంతా ఇచ్చేస్తాను. కాని మంగళసూత్రం, నల్లపూసల దండ.."

"బలేదానివే. అవి నీ మెడలో ఉంటుండగనే నీకు ఇల్లు ఇస్తానని హామీ ఇస్తున్నాను."

ఆమె అక్కడితో ఆగలేదు.

"ఏమండీ... ఈ చెవి రింగులు, చేతి గాజులు ఇచ్చేయాలా?"

ఆమెను దగ్గరకు తీసుకొని నవ్వేడు.

"పిచ్చి పెళ్ళామా! మరేం భయపడకు. నీ చెవి రింగులు జోలికి ఇల్లు రాదు. గాజుల సంగతి తర్వాత ఆలోచిద్దాం. సరేనా?"

పెళ్ళిళ్ళకూ, పేరంటాలకు బీరువాలోంచి బయటకు తీసే బంగారం ఆరు తులాలు! భారంగానూ, ఆనందంగానూ అందజేయడానికి సిద్ధపడింది భారతి.

ఎంఐజి ఇల్లుకి తాత్కాలికంగా నిర్ణయించిన ధర రెండు లక్షల డెబ్బయి వేలు.

కంపెనీ లక్షా యాభై వేలు ఫైవ్ పర్సంట్ ఇంటరెస్టుతో లోన్ ఇస్తుంది. పి.యఫ్. నాన్ రిఫండబుల్ లోన్, ఎల్ఐసి పాలసీపై వచ్చే లోన్.. లెక్కలు వేసాడు కన్నబాబు. బంగారం జోలికి వెళ్ళకుండానే మానేజ్ చేయగలననే అతని నమ్మకం. ఆ విషయం భారతితో చెప్పలేదు. చేతి కాపు కోసం ఆమెను మెంటల్‌గా ప్రిపేర్ చేసి వుంచేడు. అంతే!

"ఇల్లు వచ్చేస్తుంది. అయితే అప్పు మిగులుతుంది. నెల నెలా వెయ్యి రూపాయలకు పైగా జీతం నుంచి కోత. మిగిలిన జీతంతోనే మానేజ్ చేయాలి."

"అది నాకు వదిలేయండి"

భారతి భరోసా ఇవ్వడంతో తృప్తిగా నిట్టూర్చేడు కన్నబాబు.

"ఏవండీ మీ ఫ్రెండు ప్రసాద్ వస్తున్నాడు"

"అయ్‌యే, అయ్‌యే... అప్ బైటియే" ఆహ్వానించేడు కన్నబాబు.

"ఏమిటమ్మా వీడు మహా ఉత్సాహంగా వున్నాడు" అడిగాడు ప్రసాద్.

ఉత్సాహ విషయం చెప్పింది భారతి.

వాళ్ల ఉత్సాహంపై నీళ్లు జల్లడం ఇష్టం లేక "ఆల్ ది బెస్ట్" అన్నాడు.

కన్నబాబు కొద్దిగా కదిలేడు.

"నీవన్నదాంట్లో ఏదో మెలిక ఉంది. మన సొసైటీ మీద అపనమ్మకమా?"

"నీవు ఆశావాదివి. నేను నిరాశావాదిని."

'నీవు నీడని చూసి భయపడతావు. సొసైటీపై నీకు నమ్మకం కలిగిన రోజున నీవు కూడా మెంబర్ అవుతావా?"

"తప్పకుండా! నాకు ఇల్లు కావాలి. కంపెనీ లోన్ ఇస్తున్నందుకైనా ఇల్లు తీసుకోవాలి. అపార్టుమెంట్ తీసుకుందామనుకుంటున్నాను."

"నీవా వెధవాలోచన ఆపి మన సొసైటీ మెంబరవ్వు."

"చూద్దాం" అని వెళ్ళిపోయేడు ప్రసాద్.

ప్రసాద్‌ని వదల్లేదు కన్నబాబు. రోజూ అతని బ్రెయిన్ వాష్ చేయకుండా వదిలిపెట్టేవాడు

కాదు.

ప్రసాద్ వలె చాలమంది వెనుకంజ వేశారు. అయితే డ్యూడేట్ దగ్గర పడుతున్న కొలదీ అప్లికేషన్ల సంఖ్య పెరగసాగింది! ఆఖరు రోజునే వంద అప్లికేషన్లు సొసైటీకి చేరేయి!

చివరి రోజు కట్టిన వారిలో ప్రసాద్ కూడా వున్నాడు.

ఇల్లు అవసరం. భయం అనేది అపనమ్మకం తాలూక నీడ.

భయంతో అవకాశం వదులుకోవడం తెలివితక్కువతనం. అంతా మెంబర్లు అవుతున్నారు. నలుగురితో నారాయణ – గుంపులో గోవిందా.

సొసైటీ మనం ఎన్నుకున్నది. దాని అబ్జెక్టివ్ సర్వీస్. లాభాల కోసం మోసం చేసే బయట సంస్థ కాదు.

500 మంది మెంబర్లు అయ్యేరు.

స్థల సేకరణ కోసం అయిదు వేల చొప్పున మూడు ఇన్స్టాల్‌మెంట్లు మొత్తం పదిహేను వేలు నెల రోజుల్లో కట్టేరు.

కన్నబాబు కట్టేడు. కట్టడానికి బంగారం కొంత అమ్మేడు.

అతని మిత్రుడు ప్రసాద్ కట్టేడు.

ఏడాదిలో ఇల్లు!

స్థల సేకరణలో గోల్‌మాల్ జరిగి ఆదిలోనే గృహనిర్మాణం కార్యక్రమాలు స్థంభించిపోయేయి.

సొసైటీ వ్యాపార సంస్థ కానప్పటికీ – ఎన్నికైన డైరెక్టర్లు తోటి ఉద్యోగస్తులే అయినప్పటికీ –

డైరెక్టర్లుగా రంగంలోకి దిగేది ఉద్యోగులకు అత్యంత తొందరగా 'సర్వీస్' చేయడానికి కాదని దెబ్బతిన్న తర్వాత కన్నబాబుకి అర్థమయింది. ప్రసాద్ ఎందుకు భయపడ్డాడో అర్థమయింది.

సొసైటీ డైరెక్టర్ల ఎన్నిక అసెంబ్లీ ఎం.ఎల్.ఎ. స్థాయిలో ఎందుకు జరుగుతాయి? మంచినీళ్ళా అభ్యర్థులు డబ్బెందుకు ఖర్చు పెడతారు? పార్టీలు ఎందుకిస్తారు? మందు నెందుకు మెంబర్లపై అభిషేకం చేస్తారు?

ఆదిలోనే అవినీతి.

50 ఎకరాల భూమి సేకరణలో అవకతవకలు.

మాయ భూములు. పోరంబోకు భూములు. రీ రిజిస్ట్రేషన్ భూములు. రైతులకీ, సొసైటీకి మధ్య ఒక బ్రోకర్.

బ్రోకర్‌తో చేతులు కలిపిన డైరెక్టర్ల జేబులు నిండాయి.

సభ్యులకు అన్యాయం జరిగింది. వాళ్ళలో భయం. అయోమయం.

పోటీలో నిలబడి పదవి పొందలేక పోయిన నాయకుల ఆధ్వర్యంలో తిరుగుబాటు.

కంపెనీ యాజమాన్యం జోక్యం.

సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ రంగ ప్రవేశం. స్థలం కొనుగోలుపై ఎంక్వయిరీకి ఆదేశం. మరోవైపు బ్రోకర్‌పై కోర్టులో కేసు!

ఉద్యోగుల పైసా, పైసా కష్టార్జితం, ఇల్లు నిర్మాణానికి ఇటుకలు కాలేదు. డైరెక్టర్లు తినడానికి అటుకులుగా మారేయి.

మూడేళ్ళకి పైగా గృహ నిర్మాణ కార్యక్రమం స్తంభించిపోయింది.

కన్నబాబులో నిరాసక్తత నిర్లిప్తత, వైముఖ్యం.

సొసైటీ జవసత్వాలు కూడదీసుకోవడానికి మూడేళ్ళు పట్టింది. మళ్ళీ పుంజుకుంది. మళ్ళీ నిలబడింది.

తాజా ఎన్నికలు. అభ్యర్థుల హామీలు. ఎన్నికయిన కొత్త పాలక వర్గం.

ఎం.ఐ.జి. ఇల్లు ఖరీదు. 2.70 లక్షల నుండి 3.90 లక్షలకు పెరిగింది. ఎల్.ఐ.జి ఇల్లు హెచ్.ఐ.జి. ఇల్లు అదే క్రమంలో పెరిగేయి.

జనరల్ బాడీ మీటింగ్‌లో సభ్యులు కొంతమంది కట్టిన 15 వేలు తిరిగి ఇచ్చేయమన్నారు.

పాలక వర్గం అంగీకరించక తప్పలేదు.

500 మంది మెంబర్లలో 150 మంది డబ్బులు వెనక్కి తీసేసుకున్నారు.

వెనక్కి తీసుకున్నవారిలో కన్నబాబు ముందు ఉన్నాడు.

ప్రసాద్ వెనక్కి తీసుకోలేదు.

కన్నబాబుని కూడా తొందరపడవద్దని వారించేడు.

చిత్రంగా చూసేడు కన్నబాబు.

నవ్వేడు ప్రసాద్.

“అవును. నీ బలవంతం, ప్రోత్సాహంతో నేను ఆనాడు సొసైటీలో మెంబరు అయ్యేను. నన్ను లోనికి లాగి నీవు బయటికి వచ్చేయడం ఏం బాగాలేదు.”

“నీవు కూడా బయటకి వచ్చేయడం మంచిది.”

“లేదురా! నాకెందుకో కొత్త పాలక వర్గంపై నమ్మకం కలుగుతోంది. వాళ్ళ ధృఢదీక్ష చూస్తుంటే గృహ నిర్మాణం సాగుతుందనే నాకు అనిపిస్తోంది. “మమ్మల్ని నమ్మండి. మాకు అవకాశం ఇవ్వండి” అంటున్నారు. నమ్ముదాం. అవకాశం ఇద్దాం. మనకీ ఒకరకంగా అవకాశమే! దొరికిన ఛాన్స్‌ని జారవిడిచేస్తే చివరికి మిగిలేది శూన్యం. మరో వేదన.”

“అయితే ఏమిటంటావ్?”

“మూడు సంవత్సరాలు ఆగేం. మరో ఏడాది ఓపిక పడదాం.”

“డబ్బుతో జూదం ఆడుతున్నావ్.”

“జూదం కాదు. నమ్మకం”

"నీఖర్మ" అని తప్పుకున్నాడు కన్నబాబు.

ప్రసాద్ అదృష్టవంతుడు!

ఏడాది తర్వాత నిజంగానే ప్రసాద్‌కి ఇండిపెండెంట్ ఇల్లు లభించింది.

ఇళ్ళు కట్టడం ఎంతో వ్యయప్రయాసలతో కూడుకన్న విషయమని అందరికీ తెలిసినదే. ఈ బాధ్యత ఎంతో విజయవంతంగా పూర్తి చేసిన పాలక వర్గం గొప్పగా, గర్వంగా చెప్పుకుంది.

ఎన్నో ఒడిదుడుకులు, అవాంతరాలు ఎదురైనప్పటికి 350 గృహాలకు ఇళ్ళ ప్లానులు ఉడా వారి నుంచి సాధించగలిగింది. నిజంగా విశేషం.

గృహ నిర్మాణం కొరకు సభ్యుడు చెల్లించవలసిన అధిక మొత్తం డబ్బును కంపెనీ లోన్ ద్వారా, జీవిత భీమా హౌసింగ్ ఫైనాన్స్ ద్వారా, నాన్ రిఫండబుల్ పి.యఫ్.లోను ద్వారా సొసైటీయే వాళ్ళ వెనుక, వీళ్ళ వెనుక తిరిగి, సాధించింది. ఉద్యోగులు చేసింది ఏమిటంటే కాగితాలపై సంతకాలు అడిగినప్పుడు పెట్టడమే.

అన్ని విధాల డైరెక్టర్లు శ్రమించి కాలనీ నిర్మించేరు. కంపెనీ యాజమాన్యం, సహకార శాఖ అధికారులు అన్ని రకాలుగా సహకరించేరు.

తొమ్మిది కోట్ల తొంబయి లక్షల ప్రాజెక్టు.

అయితే పాలకవర్గం ఏమీ తినకుండా 350 ఇళ్ళను నిజాయితీగా నిర్మించారని అనుకోవడానికి ఉద్యోగస్తులు వెర్రివాళ్ళు కారు.

కాంట్రాక్టులో కైంకర్యాలు ఉంటాయి. ఉన్నప్పటికీ –

పాలకవర్గం గృహ నిర్మాణం కొరకై కంకణదారులై కృషి సల్పేరన్నది అందరూ ఆమోదించవలసిన విషయం. అభినందించవలసిన సమయం.

నిర్మాణంలో అక్రమాలు అవినీతి స్పష్టంగా కనబడుతున్నా చాలా పకడ్బందీగా, చాకచక్యంగా ఆధారాలు మరెవ్వరికీ దొరకని రీతిలో పాలకవర్గం వ్యవహారం నడిపినట్లు అపోజిషన్ వాళ్ళు కరపత్రం వేస్తే – సభ్యులు అది సీరియస్‌గా తీసుకోలేదు.

సభ్యుల అభిప్రాయం ఏమిటంటే –

పాలకవర్గం తింటే తిన్నది. మనకు ఇళ్ళు కట్టించి ఇచ్చేరు. అందుకు సంతోషించాలి.

పాలకవర్గంలో నిజంగా నిజాయితీపరుడైన నాయకుడు పొరపాటున ఉన్నా అతని నిజాయితీని మాయదారి జనం నమ్మని రోజులు.

శవాలు మాత్రమే దోపిడీ చేయవు అని నమ్మే జనం.

అవినీతి సమాజంలో విడదీయలేని భాగం.

'అవకాశం వచ్చినప్పుడు తినడంలో తప్పు లేదు –

కొంత తిను. కొంత పని చేయి. మొత్తం మింగేయకు' – ఇదీ సవరణలతో జనం అంగీకరించి, ఆమోదించిన అవినీతి.

గృహప్రవేశానికి కన్నబాబుని ఆహ్వానించేడు.

టూర్‌లో వున్నందున ఆ రోజు వెళ్ళలేక పోయేడు కన్నబాబు.

ఆఫీస్ టేబుల్‌పై ఆహ్వానం కార్డు అతణ్ణి అతలాకుతలం చేసింది. గాయాన్ని రేపింది. ఆ రోజు నిలకడగా డ్యూటీ చేయలేకపోయేడు.

ఆ సాయంత్రం బరువైన గుండెతో, ఖరీదైన గిఫ్ట్‌తో, భారతితో ప్రసాద్ కొత్త ఇంటికి బయల్దేరాడు కన్నబాబు.

❁ ❁ ❁

మాయానగర్!

మహానగరానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో శాస్త్రీయ పద్ధతిలో, గరిష్ఠ పౌర సదుపాయాలతో ఆధునికంగా, ఆదర్శంగా నిర్మించబడిన ఉద్యోగుల కాలనీ.

గృహ నిర్మాణంలో చాప కింద నీరులా కనబడకుండా మాయ జరగడం చేత 'మాయానగర్'గా పిలవబడలేదు.

పాలకవర్గం స్వంత ఇంటి కలకు ఒక సాకారమివ్వగా, సదరు కంపెనీ మానేజింగ్ డైరెక్టరుగారు ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఎంతగానో సహాయ సహకారాలు అందించి ప్రాజెక్టు సకాలంలో, విజయవంతం అయ్యేలా సేవలు అందించేరు. వారి సేవలు ప్రతి ఒక్కరూ జీవితాంతం గుర్తు పెట్టుకునేలా కాలనీకి 'మాయానగర్' అని పేరు వారి అనుమతితోనే పెట్టేరు. యం.డి. గారి భార్య పేరు మాయావతి!

మాయ అందులోనే ఉంది!

ఒక అధికారి భార్యగారి నామధేయాన్ని జపించి, నెత్తిన పెట్టుకొని ఊరేగడం కొందరికి నచ్చని మాట వాస్తవం.

"యండి ఒక ఉన్నత అధికారిగా చేయవలసింది చేశాడు. చేసినదానికి కృతజ్ఞతలు వార్షిక సభలో చెబితే చాలు. అబ్బే! మనమెందుకు అంతటితో సరిపెడతాం! మన నరనరాల రక్తం తరతరాల ఫ్యూడల్ సంస్కృతిది. భారతీయ శరీరాన్ని కాస్త బ్లేడుతో కోసి చూడు. 'బాంచను, కాల్మొక్త' అని పలవరిస్తాయి రక్తకణాలు" అన్నాడొక రాడికల్ యువకుడు ఆవేశంగా జనరల్ బాడీ మీటింగులో.

మాయానగర్!

ఆధునిక ఆంధ్రుడి నామధేయం. చివర 'రావు'లుకనుమరుగవుతున్నట్టే – కొత్తగా వెలుస్తున్న పేటలూ, వీధులూ సందులూ గొందులూ స్లమ్‌లూ సమస్తం 'ఫలానా నగర్'గానే పిలవమంటున్నాయి. పబ్లిక్‌ని కన్‌ఫ్యూజ్ చేస్తున్నాయి.

కన్నబాబు సతీసమేతంగా ప్రసాద్ ఇంటికి వెళ్ళేడు.

ప్రసాద్ కన్నబాబు దంపతులను సాదరంగా ఆహ్వానించేడు.

గిఫ్ట్ తీసుకుని థాంక్స్ చెప్పేడు.

స్వీటు, హాటు సేవిస్తూ, కబుర్లు మధ్య–

"నేను అపార్టుమెంటు తీసుకోబోతున్నాను" అన్నాడు కన్నబాబు.

"ఒకప్పుడు అపార్ట్‌మెంట్ ఇష్టం లేదన్నావు కదరా"

"గత్యంతరం లేదురా బాబు. ఏంచేయడం? గతాన్ని తవ్వకు"

"అది కాదు, నా పక్క ఇల్లు నీవు తీసుకుంటావా?"

"జోకా?"

"కాదురా బాబు. అసలు నేను నీ దగ్గరికే బయల్దేరుతున్నాను, ఆ విషయం చెప్పడానికి, లక్కీగా నీవే వచ్చావు."

ప్రసాద్ పక్క ఇల్లు బెంగాలీబాబు ముఖర్జీది. అతడు రిజైన్ చేసి మరో కంపెనీకి సొంతవూరు కలకత్తాకి వెళ్ళిపోతున్నాడు.

"నాకే చెప్పాడు. నీవు గుర్తుకొచ్చేవు. నీ తరపున మాట ఇచ్చేశాను. మరెవరికీ ఆఫర్ చేయొద్దని అన్నాను".

"బ్లాకా?"

"లేదురా బాబు. బిల్డింగ్ కాస్ట్‌కే ఇచ్చేస్తున్నాడు. మనిషి మంచోడు. వ్యాపార లక్షణాలు లేవు".

కన్నబాబులో ఉత్సాహం ఉబికింది. ఇది అనుకోని పరిణామం. అతను భారతి ముఖంలోకి చూసేడు. ఆమె కళ్ళు ఆనందంతో మెరుస్తున్నాయి.

"నన్ను ఆలోచించుకోనియ్"

"గాడిద గుడ్డు. నీవు ఆలోచించి అడుగు వేసే లోపుల మరొకడు ఎవడో వాడి ఇంట్లో గృహప్రవేశం చేసేస్తాడు. అంతేకాదు మన మిత్రులే వాడి దగ్గరకెళ్ళి 'ఒరే బెంగాలీ బాబు! నీకు బుద్ధి ఉందా? బేరం పెట్టు. బ్లాక్‌లో అమ్ము. పేపర్లో ప్రకటించు. మంచి రేటు వస్తుంది' అని బెంగాళిబాబు మనసు కంగాలీ చేసేస్తారు."

కన్నబాబుకి కంగారుగా ఉంది.

"డబ్బు చూసుకోవాలి గదా! ఎంత కట్టాలి."

"ఏడ్చినట్టే వుంది. మేము ఎలా కట్టామో నీవు అలానే కడతావు. మనం ముఖర్జీ దగ్గరికి వెళ్దాం. కాగితాలు రాయించుకుందాం. సొసైటీ ఆఫీసుకి వెళ్దాం."

"ఎప్పుడు?"

"ఇప్పుడే!"

❀ ❀ ❀

నెల రోజులు గిర్రున తిరిగేయి.

మాయానగర్‌లో సందడి. నూతన గృహప్రవేశం.

కన్నబాబు దంపతులు నూతన వస్త్రాలు ధరించి సత్యనారాయణ వ్రతం చేశారు.

విందుకీ మిత్రులు, బంధువులు విచ్చేశారు.

పెంటమ్మ కూడా వచ్చింది.

భారతమ్మ గొప్పగా ఆమెకు ఇల్లంతా చూపించింది – నా ఇల్లు ముందు నీది ఇళ్ళేనా అన్నట్టు.

"భారతమ్మా! ఇల్లు విశాలంగా బాగున్నది. నేనైతే ఈ స్థలంలో మూడు పోర్షన్లు కడతాను."

నవ్వులు.

"పెంటమ్మా! ఇక నీ బందిల దొడ్డికి సెలవ్"

మరుచటి రోజే పెంటమ్మ ఇల్లు ఖాళీ చేసి కొత్త ఇంట్లోకి దిగిపోయేరు కన్నబాబు దంపతులు.

కొత్త ఇల్లు కోసం భారతి బంగారం త్యాగం చేసిన సంగతి మర్చిపోయింది. దాచుకున్న బంగారమే అమ్మింది. వంటి మీద వస్తువుల జోలికి వెళ్ళలేదు. చెప్పాలంటే వంద తులాల బంగారం కూడా ఆమెకు ఇంతటి ఆనందం ఇవ్వలేదు. ఇల్లుని అందంగా దిద్దుకోవడంలో ఆమె ఒళ్ళు మరిచిపోయి శ్రమిస్తోంది. రోజూ ఎడతెగని పని.

కన్నబాబు జీవితంలో ఒక అద్భుతాన్ని సాధించినట్టు పరమానంద పడిపోతున్నాడు. అతని కల వాస్తవ రూపంలో ఎదురుగా ఉన్నప్పటికీ కలలో ఉన్నట్టు భ్రమ చెందుతున్నాడు! కొత్త ఇంటితో రోజు రోజుకీ అనుబంధం పెరుగుతుండడంతో.. పెంటమ్మ ఇంట్లో యిన్నాళ్ళు ఎలా వున్నదీ తలుచుకుంటే ఆశ్చర్యం వేస్తోంది అతనికి.

కన్నబాబు కిపుడు ఇల్లు తప్ప మరో ధ్యాస లేదు. మరో వ్యాపకం లేదు.

రోజులు కాదు, నెలలు గడుస్తున్నా అతని వడిలో ముద్దులొలుకుతున్న పాపలా... ఏ రోజుకా రోజు కొత్తగా మురిసిపోతున్నాడు ఇల్లుని చంకనెత్తుకొని.

ఇల్లు విశాలంగా ఉండడంతో కొత్త కొత్త వస్తువులు ఇంట్లో అమరుతున్నాయి. వాళ్ళ దగ్గరున్న వస్తుసముదాయానికి పెంటమ్మ ఇల్లు ఇరుకైపోతే – కొత్త ఇల్లు బోసిగా కనిపిస్తోంది. హాలులో కొత్తగా సోఫా సెట్టు అమిరింది. ఇది చాలదు. ఇంకా నన్ను అలంకరించమని, అలరించమని చిన్న పిల్లలా మరాం చేస్తోంది ఇల్లు.

అడుగున ఎక్కడో పడిపోయి అణగారిపోయిన అభిరుచులు, సరదాలు, ఇష్టాలు అతని నుంచి బయటికి తోసుకు వస్తున్నాయి.

అతనికి మొక్కలు పెంపకంపై ఎంత మక్కువ ఉన్నదో అర్థమయి అతనికే వింతగా తోచింది. ఇంటి ముందు గులాబీ తోట వేశాడు. రకరకాల క్రోటన్సు మొక్కలు వేశాడు. ఇంటికి నాలుగు వైపులా కొబ్బరి చెట్లు వేశాడు. రెండు మూడేళ్ళకే ఫలసాయాన్ని అందించే మామిడి మొక్కలు వేసేడు. ఒకటి రసాలు. రెండోది బంగినపల్లి. అంతేకాక సపోట, జామ, దానిమ్మ, బొప్పాయి కూడా చోటుచేసుకున్నాయి. ఇంటి వెనుక పెరట్లో టమోటా, బెండ, బీర పాదులూ కూడా లేచాయి. అతని ఉత్సాహానికి సరిపోయేటంత పెరడు ఆ యింటికి లేదు!

మొక్కలకి గొయ్యిలు తవ్వడం, గెత్తం వేయడం, నీళ్ళు పోయడం, ఉదయం, సాయంత్రం కన్నబాబుకి దినచర్యగా మారింది. మొక్కల పట్ల భర్తకి అంతటి ఇంట్రెస్టు ఉందని ఏ మాత్రం ఊహించలేదు భారతి.

తనని కాకుండా ఇల్లునే కౌగిలించుకుని పరవశించిపోతున్నట్లు భర్తతో సరసమాడింది.

అటాచ్‌డు బాత్రూం కాకుండా మరో బాత్‌రూమ్ ఫ్లస్‌వుట్ టాయిలెట్ కూడా ఉన్నాయి. పెంటమ్మ ఇంట్లో ఉన్నప్పుడు వీధిలో దొడ్లోకి చెంబుతో ఎలా వెళ్ళింది తలుచుకుంటే తనపై తనకే రోత కలుగుతోంది.

కావాల్సినంత ప్రయివసీ ఉండడంతో బెడ్‌రూమ్‌లో మనిషి కొత్త కొత్తగా ప్రవర్తిస్తూ సెక్సులో ఆమెకు ఎనలేని సుఖాన్ని కలుగచేస్తున్నాడు. అతను పొందుతున్నాడు.

అతడు అప్పుడే కాదు, ఉదయం లేచినప్పటి నుంచి హుషారుగా, ఏక్టివ్‌గా ఉంటున్నాడు. ఎక్కడలేని చైతన్యం అతనిలో.

ఆమెకు ఇంకా గుర్తు ఉంది. ఆ మధ్య కన్నబాబు నెలల తరబడి ఏదో పోగొట్టుకున్నట్టు ముభావంగా, నిర్లిప్తంగా, నిరాసక్తంగా, డల్‌గా ఉండటం చూసి ఆమె భయపడింది. బలవంతంగా డాక్టరు వద్దకు తీసుకువెళ్ళింది. మందులు వాడింది. ప్రయోజనం శూన్యం.

చక్కని గాలి, నిండా వెలుతురు సమృద్ధిగా ఉన్న విశాలమైన సొంత ఇల్లు అతని రోగానికి టానిక్ అయింది. పంజరం నుంచి ఆకాశంలోకి ఎగిరే పక్షి అయ్యేడు.

అదృష్టవశాత్తు అతని ఇంటి ఎదురుగా పార్కు. పెంటమ్మ ఇంట్లో ఉన్నప్పుడు పిల్లలు ఆటలే మరిచేరు. ఇక్కడ సాయంత్రం స్కూల్ నుంచి రాగానే పుస్తకాలు పారేసి, తల్లి పెట్టిందేదో గబగబా తిని, తాగి పది నిముషాల్లో పార్కులో ప్రత్యక్షమవుతారు. చీకటి పడి, తల్లి కేకలకు భయపడి అయిష్టంగా ఇంటికి చేరి పుస్తకాలు తెరుస్తారు పిల్లలు.

'ఒరే! కన్నబాబు. నీ జీవితం ధన్యమయింది ఫో'

అరిచింది ఎవరో కాదు కన్నబాబే!

పక్కనే పడుకున్న భారతి తుళ్ళిపడి లేచింది. అతని నిద్దట్లో పలవరింపు కాదు. కొత్త ఇల్లు మైకం ఇచ్చిన కిక్! పైకి తన్నుకొచ్చిన పారవశ్యం!

❁ ❁ ❁

'మాయానగర్' మహానగరానికి మణిహారం అయింది. ప్రతి ఇంటికీ బౌండరీ వాల్ - పక్కవాడితో సరిహద్దుల గొడవ లేదు. ప్రతి ఇల్లు సాధ్యమైనంత వాస్తు దృష్టితో నిర్మాణం. విశాలమైన రోడ్లు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ. 60 వేల గ్యాలన్ల ఓవర్‌హెడ్ ట్యాంక్‌తో నీటి సరఫరా సిస్టం. షాపింగ్ కాంప్లెక్స్, రిక్రియేషన్ సెంటర్, శివకేశవ, అయ్యప్ప దేవాలయాల సముదాయం. డి.ఎ.వి. పబ్లిక్ స్కూల్, కళ్యాణమండపం, బ్యాంక్ మరియు పోస్టాఫీస్. మురికివాడలకు అతీతంగా సుందర నగరం మాయానగర్.

ఒక్క సంవత్సరం తిరిగిందో లేదో -

మాయానగర్ అదృష్టం పండింది.

మాయానగర్‌కి పది కిలోమీటర్ల దూరంలో 300 కోట్ల పవర్ ప్లాంటు పనులు ప్రారంభమవడంతో ఆ నగరానికి దశ తిరిగింది.

ప్రతి ఇల్లు మెకన్నాస్ గోల్డ్ అయింది.

పది వేలు అడ్వాన్స్ ఇచ్చి నెలనెలా అద్దె రెండు వేలు ఇవ్వడానికి సిద్ధపడి ఎందరెందరో ముందుకొస్తున్నారు.

ఉద్యోగస్తులు ఒకరూ, ఒకరూ ఇళ్ళు ఖాళీ చేసి అద్దెలకిచ్చి తాము పనిచేసే కంపెనీకి దగ్గరగా ఉన్న మురికి పేటల్లో ఐదారు వందల అద్దెకి వెళిపోతున్నారు.

డబ్బెవరికి చేదు!

ఇంతటి అవకాశం ఎలా వదుల్కోగలరు?

మాయానగర్ ఇళ్ళపై ఒత్తిడి పెరిగింది.

నాలుగైదు నెలల్లో మూడొంతుల మంది సొంత ఇళ్ళు వదిలి అద్దె ఇళ్ళకి పోయేరు.

ఏదో ఉప్పెనో, వరదో వస్తే ఊరు ఖాళీ చేసి తండోపతండాలుగా వెళ్ళిపోతున్నట్లు పోతున్నారు.

మాయానగర్‌కి ఏదో మాయరోగం – కలరానో, ప్లేగో వచ్చినట్టు జనాలు పారిపోతున్నారు.

ప్రసాద్ కూడా ఇల్లు వదిలి, అద్దెకిచ్చి అడ్వాన్సు తీసుకొని ఏ మూలకో వెళ్ళిపోయేడు.

పోయిన వాడు పోకుండా కన్నబాబుని కూడా బ్రెయిన్‌వాష్ చేయడం మొదలు పెట్టేడు.

“ఉరే! నేనూ, నా కుటుంబం ఎంచక్కా ఇక్కడ వున్నాం, హేపీగా ఉన్నాం. మమ్మల్ని డిస్టర్బ్ చేయకు” అన్నాడు.

అప్పు లేకుండా జీవితం వుండదు. తీసుకున్న లోనుల కింద ప్రతి నెల కోత విధిస్తున్నా రోజులు కన్నబాబుకి బాగానే సాగిపోతున్నట్టుగనే ఉంది.

భారతికి అయోమయంగా ఉంది.

ఒక కుటుంబంలా ఎంతో కలివిడిగా ఉన్న ఇరుగుపొరుగు తనని ఒంటరిదాన్ని చేసి పోతుంటే ఆమెకి అదోలా వుంది. తనెందుకు మడి కట్టుకుంది?

అడ్వాన్సు, అధిక అద్దె ఆమెనూ అయస్కాంతంలా లాగుతోంది ఒకవైపు. మాయానగర్‌లో ఇదెక్కడి విడ్డూరం!

ఖాళీ ఉన్న ఇళ్ళని ఎవరైనా అద్దెకి అడుగుతారు. ఇక్కడ అలా కాదు. ఇంటి ఓనర్ దగ్గరకొచ్చి కావాల్సినంత అద్దె తీసుకుని ఇల్లు ఖాళీ చేసి పొమ్మంటున్నారు. ఒకరు తర్వాత ఒకరు. ఇళ్ళపై అటాక్. రోజూ ఇదే న్యూసెన్స్.

కన్నబాబుకి ఒళ్ళు మండి ప్రహరీ గేటు వద్ద ‘యీ యిల్లు అద్దెకివ్వబడదు’ అని బోర్డు పెట్టేశాడు.

అయినా బోర్డుని ఖాతరు చేయకుండా లోనకి చొరబడిపోతున్నారు.

'ఇదెక్కడ గోలరా బాబూ!' గట్టిగా అరచి జుట్టు పీక్కుంటున్నాడు కన్నబాబు.

ఒక కుటుంబంలా వుండే ఉద్యోగులు ఆరు నెలల్లో సొంత ఇళ్ళు అద్దెకిచ్చి ఎక్కడెక్కడికో వెళ్ళిపోయేరు!

ఒంటిపిల్లి రాకాసిలా కన్నబాబు ఒక్కడే మిగిలేడు. వంటరివాడు అయ్యేడు. డబ్బు కోసం మనమున్నామా! మన కోసం డబ్బు ఉందా! మన కోసం మనం లేమా!

అతనిపై ఒత్తిడి బయట మిత్రులే కాకుండా ఇంట్లో భారతి నుంచి కూడా మొదలయింది. కాదు తీవ్రమయింది.

పెంటమ్మ కొత్త ఇళ్ళు కట్టి గృహప్రవేశానికి ఆహ్వానించింది ఒకరోజు.

భారతి, కన్నబాబు వెళ్ళేరు.

మూడు పోర్షన్లు ఇల్లు కట్టింది. ఇంతకు మునుపులా కామన్ దొడ్లు కామన్ బాత్రూంలు కాకుండా ప్రతి పోర్షన్‌కి సెపరేట్‌గా ఏర్పాటు చేసింది. ఇది కట్టింది వేరే చోట! పెంటమ్మ పాత ఇంటి వద్దే గేదెలతో పాటు నివాసం.

గృహప్రవేశం నుంచి ఇంటికి వస్తూ భర్తతో భారతి అంది.

"పెంటమ్మ ఇల్లు బాగా కట్టింది కదండీ. ఇంకా ఎవరికీ అద్దెకివ్వలేదట. అద్దె వెయ్యి రూపాయలట. దిగుతావేటి భారతమ్మా అనడిగింది."

"ఏమిటి నీ ఉద్దేశ్యం?" కసిరేడు.

"ఎందుకలా అరుస్తారు? నేనేమి పెంటమ్మ ఇంట్లో దిగుతాను అనలేదు. పెంటమ్మ దిగమంది అని చెబుతున్నాను"

అటు మాయానగర్‌లో–

కన్నబాబు ఇంటి ముందు –

కన్నబాబు కోసం ఎదురు చూస్తూ ఒక మారుతీ కారు ఆగి వుంది.

వస్తున్న కన్నబాబు దంపతులను చూసి కారులోంచి ఒక ఆసామి దిగేడు.

అతడు బాగా బలిసి వున్నాడు.

బలిసిన ఒళ్ళుని వినయంగా వంచి ఇల్లు అద్దెకి అడిగేడు.

కన్నబాబుకి ఒళ్ళు మండింది.

అతణ్ణి కసిరికొట్టినట్టు మాట విసిరేడు.

"యస్! అద్దెకిస్తాను. అడిగినంత ఇవ్వగలరా?"

"అడగండి" – మళ్ళీ వినయం మారుతీ కారుది.

"పాతిక వేలు అడ్వాన్సు – మూడు వేల అద్దె"

అంతే!

బోర్ల పడిపోయేడు కన్నబాబు – పెంటమ్మ కొత్త ఇంట్లో.

అతని అందమైన కల పగిలి ముక్కలు ముక్కలయింది.